# విధుల ప్రకరణం

# (ఆస్తి పంపకం ఆజ్ఞలు)

## 1వ అధ్యాయం - వారసులకు వారి నిర్ణీత వాటాలను ఇచ్చాక మిగిలితే దగ్గరి బంధువులకివ్వండి

1041. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:- "వారసుల కోసం (ఖుర్ఆన్‌లో) నిర్ణయించబడిన (ఆస్తి) వాటాలను ఆయా వారసులకు ఇచ్చేయండి. ఆ తర్వాత ఏదయినా మిగిలితే మృతునికి అతి సన్నిహితులయిన పురుష బంధువులకు ఇవ్వాలి."★

[సహీహ్ బుఖారీ : 85వ ప్రకరణం - ఫరాయజ్, 5వ అధ్యాయం - మీరాసుల్ వలది మిన్ అబీహి వ ఉమ్మిహీ]

## 2వ అధ్యాయం - వారసులు లేని వ్యక్తి ఆస్తి గురించిన ఆజ్ఞలు

1042. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం:- ఒకసారి నేను జబ్బుపడితే, దైవప్రవక్త (సల్లం), హజ్రత్ అబూబకర్ (రజి)లు నన్ను పరామర్శించడానికి కాలినడకన వచ్చారు. ఆ సమయంలో నేను స్పృహ తప్పి ఉన్నాను. దైవప్రవక్త (సల్లం) నా పరిస్థితి చూసి, వుజూ చేసి, ఆ వుజూ నీటిని నాపై చిలికించారు. దాంతో నాకు స్పృహ వచ్చింది. చూస్తే ఎదురుగా దైవప్రవక్త (సల్లం) కన్పించారు. నేనాయన్ని చూసి "దైవప్రవక్తా! నేను నా ఆస్తిని ఏం చెయ్యమంటారు? దాన్ని ఎలా పంపకం చేయాలి?" అని అడిగాను. దైవప్రవక్త (సల్లం) వెంటనే నా కెలాంటి సమాధానమివ్వలేదు. తర్వాత ఆస్తి పంపిణీ సూక్తి అవతరించింది.

[సహీహ్ బుఖారీ : 75వ ప్రకరణం - అల్‌మర్జా, 5వ అధ్యాయం - ఇయాదతిల్ ముగ్మా అలైహి]

## 3వ అధ్యాయం - అన్నిటికన్నా చివర్లో అవతరించిన (దైవ) సూక్తి "కలాలా"

1043. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం:- ఖుర్ఆన్ సూరాలన్నిటిలోకి చివర్లో బరాత్ సూరా అవతరించింది. అన్నిటికంటే చివర్లో ఈ సూక్తి అవతరించింది - యస్తఫ్ తూనక్ ఖులిల్లాహు యుఫ్తీకుమ్ ఫిల్ కలాలా. (సూరె నిసా: 176)

[సహీహ్ బుఖారీ : 65వ ప్రకరణం - అత్తఫ్సీర్, 4 - నిసా సూరా, 27వ అధ్యాయం - యస్తఫ్ తూనక్ ఖులిల్లాహు యుఫ్తీకుమ్]

---

★ వారసుల నిర్ణీత వాటాలను వారసులకు ఇచ్చివేసిన తరువాత, ఏదైనా మిగిలితే దాన్ని మృతునికి అతి సన్నిహితులయిన పురుష బంధువులకు ఇచ్చివేయాలి. అంటే తండ్రి లేదా కొడుకులని అర్థం. దగ్గరి బంధువులు ఉండగా వారిని కాదని దూరపు బంధువులకు ఇవ్వకూడదు.

## 4వ అధ్యాయం - మృతుడు వదిలిన ఆస్తి అతని వారసులకు దక్కాలి

1044. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం:- రుణగ్రస్తుడయి ఉన్న వ్యక్తి చనిపోయి అతని జనాజా (శవం) దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసుకురావడం జరిగితే, దైవప్రవక్త (సల్లం) (శవాన్ని తీసుకు వచ్చిన వారినీ) "ఇతను తన అప్పు తీర్చడానికి ఆస్తి ఏదైనా వదలిపెట్టాడా?" అని అడిగేవారు. అతను తన అప్పు తీర్చడానికి సరిపడే అంత ఆస్తి వదలిపెట్టాడని సమాధానం వస్తే దైవప్రవక్త (సల్లం) అతని కోసం జనాజా నమాజు చేసేవారు.★ అలాంటి సమాధానం రాకపోతే "మీరే మీ సహచరుని కోసం జనాజా నమాజ్ చేసుకోండి" అని చెప్పేవారు.

కొంత కాలానికి దేవుడు తన ప్రవక్త కోసం విజయ ద్వారాలు తెరుస్తాడు (అంటే పెద్ద ఎత్తున యుద్ధ సొత్తు రావడం మొదలవుతుంది.) అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు; "నేను ముస్లింలకు వారి ప్రాణాల కన్నా అతి సన్నిహితుడ్ని; వారి దగ్గరి బంధువుల కన్నా దయామయుడ్ని; ఆత్మబంధువుని, సంరక్షకుడ్ని, అందువల్ల ఎవరైనా ముస్లిం చనిపోతే, అతను ఎవరికైనా బాకీ పడి ఉంటే, నేనా బాకీ తీర్చుతాను. మృతుడు వదలిపెట్టిన ఆస్తి అతని వారసులకు లభిస్తుంది."

**[సహీహ్ బుఖారీ: 39వ ప్రకరణం - కిఫాలత్, 5వ అధ్యాయం - అద్దీన్]**

---

★ అప్పు తీర్చడం ఎంత ముఖ్యమైన బాధ్యతో ఈ హదీసు నొక్కి చెబుతోంది. మనిషి తాను జీవించి ఉండగానే అప్పు తీర్చవలసిన అవసరాన్ని కూడా ఈ హదీసు సూచిస్తోంది. ఇమామ్ నవవీ (రహ్మలై) ఈ హదీసుపై వ్యాఖ్యానిస్తూ "రుణగ్రస్తుడు చనిపోయినప్పుడు అతని జనాజా నమాజ్ చేయడానికి దైవప్రవక్త (సల్లం) అంగీకరించలేదంటే, తద్వారా బ్రతికి ఉన్నవారు దైవానికి భయపడి తమ అప్పులను తీర్చివేయడానికి ప్రయత్నిస్తారని ఆయన ఆశించడమేనని అన్నారు. చనిపోయిన వ్యక్తి అప్పులు ప్రభుత్వ ధనాగారం (బైతుల్ మాల్) నుండి తీర్చే విషయంలో ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.

- సంకలనకర్త